# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 318 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 22 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## మేడారం జాతర అద్భుతం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు

2లో..



# వందేండ్ల భవిష్యత్‌కు ప్రణాళికలు

### అభివృద్ధి మీదే ఫోకస్ పెట్టాం

పెట్టుబడులకు సర్కారు నుంచి రక్షణ

జహీరాబాద్‌లో నిమ్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్యలో డ్రైపోర్టులు

ఫార్మా విలేజ్‌లు డెవలప్ చేసి సౌకర్యాలు కల్పిస్తం

సీఐఐ విద్య, నైపుణ్యాభివృద్ధి సమావేశంలో సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర వందేండ్ల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతామని అన్నారు. తమ ఫోకస్ అంతా అభివృద్ధిపైనే పెట్టామని అన్నారు. ఇందుకోసమే కేంద్ర మంత్రులతో భేటీ అయినట్టు చెప్పారు. రాష్ట్రంలో పెట్టబడులు పెట్టే వారికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో రక్షణ కల్పిస్తుందని, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమయ్యే సౌకర్యాలను కూడా కల్పిస్తుందని అన్నారు. కొత్త ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. అలాగే ఏ స్థాయిలో ఉన్నవారైనా తమ ఆలోచనలను ప్రభుత్వంతో పంచుకోవచ్చని అన్నారు. వారి ఆలోచనలను కూడా అభివృద్ధికి ఉపయోగిస్తామని అన్నారు. బుధవారం హైదరాబాద్ లో నిర్వహించిన సీఐఐ విద్య, నైపుణ్యాభివృద్ధి సమావేశానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. అపారమైన అనుభవం ఉన్న పారిశ్రామిక వేత్తలు తమ అనుభవాన్ని రంగరించి తెలంగాణ అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 2050 నాటికి మాస్టర్ ప్లాన్ ఫర్ తెలంగాణ తయారు చేస్తున్నామని, రాష్ట్రం మొత్తం సింగిల్ యూనిట్ గా ప్రపంచంతో పోటీ పడాలన్నదే తమ ఆలోచన అని చెప్పారు. ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య డ్రైపోర్టులను ఏర్పాటు చేస్తామని, ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయడంతో పాలు అక్కడ అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. విద్య, వైద్యం, రోడ్లు, తాగునీరు ఇలా మౌలిక వసతులన్నీ కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. డిఫరెంట్ ఇన్వెస్టర్లను క్లస్టర్లుగా విడగొట్టనున్నామని సీఎం చెప్పారు. జహీరాబాద్‌లో నిమ్స ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిదని, త్వరలో ఏర్పాటు చేయబోతున్నమని సీఎం చెప్పారు. ఇంజినీరింగ్ చదివిన వాళ్లు కూడా 15 వేలకు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని, స్కిల్




విషయంలో ఎక్కడో గ్యాప్ ఉందని తాను భావిస్తున్నానని, దానిని పూర్తి చేయడానికి ప్రయత్నించాలని కోరారు. తాము ప్రారంభించబోయే స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు ఇందుకు ఉపయోగపడతాయని భావిస్తున్నట్టు సీఎం చెప్పారు. ఆర్థిక ప్రగతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులకు రక్షణ కల్పించడమే కాకుండా.. లాభదాయకంగా ఉండేలా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఇందిరాగాంధీ విధానపరమైన నిర్ణయం తీసుకుని ఐడీపీఎల్‌ను ప్రారంభించినందునే ఫార్మా రంగంలో హైదరాబాద్ మెరుగైన స్థితిలో ఉందన్నారు. పాలకుల నిర్ణయాలు, విధానాలు రాష్ట్ర ఆర్థిక పురోగతికి తోడ్పడతాయని చెప్పారు. అవుటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) గురించి గతంలో మాట్లాడితే అవన్నీ అవసరమా అన్నారని.. ఇప్పుడు అదే హైదరాబాద్, తెలంగాణకు లైఫ్‌లైన్‌గా మారిందన్నారు.

..మిగతా 2లో




## కొడంగల్ అభివృద్ధికి రూ.4,369 కోట్లు

### సీఎం హెూదాలో సొంత నియోజకవర్గానికి రేవంత్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన!

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం): సీఎం రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో పర్యటించించారు. సీఎం హెూదాలో ఆయన తొలిసారి తన నియోజకవర్గానికి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా రూ.3,961 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఇందులో రూ.2,945 కోట్లతో కొడంగల్-నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని స్టార్ట్ చేయడం కూడా ఉంది. కొడంగల్ నియోజకర్గాన్ని వచ్చే ఐదేళ్లలో అన్ని విధాలా అభివృద్ధి చేసేలా రేవంత్ ప్లాన్ చేస్తున్నారు. గత డిసెంబర్ 29న వికారాబాద్ కలెక్టర్ నేతృత్వంలో కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కాడా)ని ఏర్పాటు చేశారు. కొడంగల్ ప్రజలు చిరకాలంగా ఎదురు చూస్తున్న నారాయణపేట్ - కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేశారు. దీనికి రూ.2,945 కోట్లు ఖర్చుచేయనున్నారు. రూ.6.8 కోట్ల అంచనా వ్యయంతో కొడంగల్ లో ఆర్ అండ్ బి అతిథి గృహం, రూ.344.5 కోట్ల అంచనా వ్యయంతో కొడంగల్ నియోజకవర్గ వ్యాప్తంగా సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ రోడ్లు,వాటి విస్తరణ,పలు బ్రిడ్జిల నిర్మాణాలు, రూ.27.886 కోట్లతో వికారాబాద్ జిల్లాలో బిటి రోడ్డు సదుపాయం లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేసేందుకు శంకుస్థాపన చేశారు. రూ.5 కోట్లతో గిరిజన సంక్షేమ హాస్టల్ భవనానికి భూమి పూజ చేశారు. రూ.25 కోట్లతో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ శాశ్వత భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.40 కోట్లతో సి.సి రోడ్ల నిర్మాణం, రూ.7.13 కోట్లతో దౌల్తాబాద్ జూనియర్ కాలేజి, రూ.7.13 కోట్లతో బొమ్రాస్పేట్ జూనియర్ కాలేజి, రూ.25 కోట్లతో నీటూర్ గ్రామం, దౌల్తాబాద్ మండలం మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్/కాలేజికి నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. రూ.360 కోట్లతో చంద్రకల్ గ్రామం,దౌల్తాబాద్ మండలంలో నూతన వెటర్నరీ కాలేజి , రూ.30 కోట్లతో కోస్గి మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ, రూ.11 కోట్లతో కోస్గి మండల కేంద్రంలో మహిళా డిగ్రీ కళాశాలకు శంకుస్థాపన

..మిగతా 2లో



## సింగరేణిలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం): సింగరేణి కాలరీస్‌లో ఖాళీగా ఉన్న 317 డైరెక్ట్ రిక్రూట్మెంట్ పోస్టులను, అలాగే 168 ఇంటర్నల్ రిక్రూట్మెంట్ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు వీలుగా నోటిఫికేషన్లు సిద్దం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. సింగరేణి ఛైర్మన్ అండ్ ఎం.డీ బలరామ్ నాయక్‌ను ఆదేశించారు. సింగరేణిలో కారుణ్య నియామక ప్రక్రియను వేగంగా చేపట్టాలని, ఈ ఏడాదిలో కనీసం వెయ్యి మంది వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలో అధికారులతో డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి సీఎం మాట్లాడుతూ ఉద్యోగాల నియామక ప్రక్రియ చాలా పారదర్శకంగా ఉండాలన్నారు. పరీక్షల్లో ఏలాంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. నోటిఫికేషన్ల ప్రక్రియ పకడ్బందీగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సింగరేణి ఉద్యోగ మేళలో ఇచ్చిన హామీ మేరకు వారసుల వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచే విషయంలో వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. సింగరేణి కార్మికుల కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తో ఏలాంటి ప్రీమియం చెల్లించనవసరం లేకుండా చేసుకున్న రూ.కోటి ప్రమాద బీమా అవగాహన ఒప్పందం పురోగతి గురించి ఆరా తీశారు. ప్రమాదభరితమైన బొగ్గు రంగంలో


..మిగతా 2లో

## ఆటోను ఢీ కొట్టిన లారీ

### తొమ్మిది మంది మృతి, నలుగురి పరిస్థితి విషమం

బీహార్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం): బుధవారం తెల్లవారుజామున బీహార్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 9మంది మృతిచెందగా మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. బుధవారం తెల్లవారుజామున ఓ ఆటోరిక్షాను లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బీహార్ లోని రామ్ గౌడ్ చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లఖిసరాయ్ దగ్గరున్న ఝూల్నా గ్రామ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం గురించిన వివరాలను తెలుపుతూ.. బుధవారం తెల్లవారుజామున

..మిగతా 2లో





## పార్టీ ఆదేశిస్తే మల్కాజిగిరి నుంచి పోటీ

### ఈటల రాజేందర్ క్లారిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం): మల్కాజిగిరి నుంచి పోటీ చేయాలన్న తన కోరికను ఈటల రాజేందర్ బహిరంగంగానే వ్యక్తం చేసారు. బీజేపీ అధిష్టానం అవకాశం ఇస్తే

..మిగతా 2లో

## మేడారం జాతరకు పోటెత్తిన భక్తజనం



### గద్దెలపైకి చేరుకున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు

మేడారం, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం): శివసత్తుల పూనకాలు, పొర్లు దండాలు, బెల్లం ఘుమఘుమలు, బంగారం మొక్కులు..! గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే వనదేవతల పండగ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర కోలాహలంగా సాగుతోంది. వనంలో ఉన్న దేవతలు.. జనం మధ్యకు రావడంతో జాతరకు పూనకం పుట్టింది. జంపన్నవాగు జనసంద్రమైంది. కీకారణ్యం.. జనారణ్యమై కోలాహలంగా మారింది. భావోద్వేగం కట్టలు తెంచుకుంది. సల్లంగా సూడు తల్లీ అంటూ శరణు ఘోషలతో దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. డప్పు వాద్యాలు, సంప్రదాయ నృత్యాల మధ్య సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరుకున్నారు. ఇలవేల్పులైన తల్లులకు భక్తులు జంపన్న వాగులో పవిత్ర స్నానాలాచరించి నిలువెత్తు బంగారం, పసుపు, కుంకుమ

..మిగతా 2లో

# సింగరేణిలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

మొదటి పేజీ తరువాయి...

పనిచేస్తున్న 43 వేల మంది ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత ను కల్పించిన వారమవుతామని తెలిపారు. ఇప్పటి వరకు కోల్ ఇండియాలోనూ ఇలాంటి ఒప్పందం లేదని, త్వరలో మిగిలిన బ్యాంకులతోనూ ఈ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సీ.ఎండి బలరామ్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. కోటి ప్రమాద బీమాపై కార్మికులకు అవగాహన కల్పించాలని డిప్యూటి సీఎం సూచించారు. సింగరేణి ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్ను ఈ నెల 26వ తేదీన ఆవిష్కరణకు ఏర్పాట్లు చేయాలని డిప్యూటి సీఎం సింగరేణి అధికారులను ఆదేశించారు. సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టిన మిగిలిన సోలార్ ప్లాంట్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. సింగరేణి ఉద్యోగులు, అధికారుల సౌకర్యార్థం హైదరాబాద్ లో నిర్మించతలపెట్టిన అతిథి గృహం భూమి పూజ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరై శంకుస్థాపన చేస్తామన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం సహకారం అందించేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదే కాకుండా గోదావరిఖని, మంచిర్యాల కార్మికులకు సురక్షిత మంచినీరు అందించేందుకు వీలుగా చేపట్టిన ర్యాపిడ్ గ్యావిటీ ఫిల్టర్లను ప్రారంభించడానికి సిద్ధం చేయాలన్నారు. ఈ



వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాలపై రోజువారీ సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు సింగరేణిలో ఖాళీగా ఉన్న 317 డైరెక్ట్, 168 ఇంటర్నల్ పోస్టులకు గురువారం నోటిఫికేషన్లను జారీ చేస్తున్నామని ఆసంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ శ్రీ ఎన్.బలరామ్ వెల్లడించారు. డిప్యూటీ సీఎంతో భేటీ అనంతరం హైదరాబాద్ సింగరేణి భవన్ లో డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. వారసుల వయో పరిమితిని 40 ఏళ్లకు పెంచే ప్రతిపాదనలపై అన్ని చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ (పర్సనల్) శ్రీ ఎన్.వి.కె.శ్రీనివాస్ ను ఆదేశించారు. కొత్తగూడెం సోలార్ ప్లాంట్ ప్రారంభం పనులను, అలాగే హైదరాబాద్ అతిథి గృహం భూమి పూజ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.



# మేడారం జాతర అద్భుతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం): ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగ, తెలంగాణ కుంభమేళగా పిలిచే మేడారం సమ్మక్క సారక్క జాతర సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'మేడారం జాతర.. గిరిజనుల అతిపెద్ద పండుగల్లో ఒకటి. ఈ జాతర భక్తి, సంప్రదాయం, సమాజ స్ఫూర్తిల గొప్ప కలయిక. మనం సమ్మక్క- సారక్కలకు ప్రణమిల్లుదాం. వారు అభివ్యక్తీకరించిన ఐక్యతా స్ఫూర్తిని, పరాక్రమాన్ని గుర్తు చేసుకుందాం. మన సాంస్కృతిక వారసత్వానికి చిరకాల స్ఫూర్తిగా నిలిచే ఈ సమ్మక్క-సారక్క మేడారం జాతర ప్రారంభోత్సవానికి శు భాకాంక్షలు' అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. కాగా, తెలంగాణలో అతి పెద్ద మహా కుంభవేళగా భావించే మేడారం మహాజాతర రెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. ఈ ఏడాది బుధవారంఈ మహాజాతర మొదలైంది. జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు ఇప్పటికే భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఇంకా పెద్ద ఎత్తున భక్తులు వస్తూనే ఉన్నారు. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా మేడారం తరలి వస్తున్నారు. సమ్మక్క తనయుడు కన్నెపల్లిలో కొలువైన జంపన్న మంగళవారం రాత్రి 7.09 గంటలకు బయలుదేరి 8 గంటలకు వాగు ఒడ్డున ఉన్న గద్దెపైకి చేరుకున్నాడు. పూజారి పోలెబోయిన సత్యం కన్నెపల్లిలోని ఇంటిలో పూజా సామగ్రిని శుద్ధిచేసిన అనంతరం జంపన్న గద్దెకు అలుకుపూతలు నిర్వహించి ఆయన ప్రతిరూపమైన డాలు, కర్రకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. గ్రామ మహిళలు ఊరు పొడవునా నీళ్లారబోస్తూ జంపన్నను సాగనంపారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సారలమ్మను కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలపైకి తెచ్చే ప్రక్రియ మొదలైంది.

# పార్టీ ఆదేశిస్తే మల్కాజిగిరి నుంచి పోటీ

మొదటి పేజీ తరువాయి...

మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా పోటీకి సిద్ధమేనని ఈటల స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈటల రాజేందర్ లోక్ సభ ఎన్నికలపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కు ఓటు వేస్తే ఎలాంటి లాభం ఉండదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంతోనే దేశంలో అభివృద్ధి సాధ్యమని స్పష్టంచేశారు. మోదీ హయాంలో భారత్ లో సమూలమార్పులు తీసుకొచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల వేళ తెలంగాణ ప్రజలు మార్పుకోరుకున్నారని ఈటల తెలిపారు. అందుకే కాంగ్రెస్ అధికారం కట్టబెట్టారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఓడిపోయిన అభ్యర్థులు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అహంకార పాలనకు ఇదే నిదర్శనమని విమర్శించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బండి సంజయ్, కిషన్ రెడ్డి ఓడిపోయారు. కానీ ఆ తర్వాతా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ఇద్దరు నేతలు పోటీ చేశారు. కరీంనగర్ నుంచి బండి సంజయ్ ఎంపీగా విజయం సాధించారు.





# గగన్‌యాన్‌లో ఇస్రో మరో ముందడుగు..!

## మిషన్ కోసం సీఈ20 క్రయోజెనిక్ ఇంజిన్ సిద్ధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం): చంద్రయాన్-3, మిషన్ ఆదిత్య ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించింది భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో ప్రయోగానికి మిషన్‌కు సన్నద్ధమవుతున్నది. ప్రస్తుతం గగన్‌యాన్ మిషన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ మిషన్‌లో తొలిసారిగా అంతరిక్షయాత్ర చేపట్టనుండగా.. ఈ కీలకమైన ప్రాజెక్టులో ఇస్రో మరో ముందడుగు వేసింది. మిషన్ కోసం ఎల్‌వీఎం-3 లాంచ్ వెహికిల్ క్రయోజనిక్ ఇంజిన్‌ను ఇస్రో వాడనున్నది. సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్ గగన్‌యాన్ మిషన్‌కు సిద్ధంగా ఉందని ఇస్రో తెలిపింది. అనేక కఠినమైన పరీక్షల తర్వాత సీ20 క్రయోజనిక్ ఇంజిన్ భద్రతా ప్రమాణపత్రాన్ని పొందిందని తెలిపింది. తొలి మానవరహిత ఫ్లయిట్ ఎల్‌వీఎం-3 జీ1 కోసం సిద్ధం చేసిన సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్ అన్ని పరీక్షల తర్వాత సర్టిఫికెట్ పొందిందని.. ఈ ప్రక్రియ ఈ నెల 13న చివరి దశ క్వాలిఫికేషన్ పరీక్షలు పూర్తయ్యిందని బుధవారం ఇస్రో ప్రకటించింది. మనుషులను సురక్షితంగా తీసుకెళ్లడానికి ఎల్‌విఎం3 రాకెట్‌కు శక్తినిచ్చే సీఈ20 క్రయోజెనిక్ ఇంజిన్ మానవ రేటింగ్‌లో ప్రధాన మైలురాయిని సాధించిందని భారత అంతరిక్ష సంస్థ ఇస్రో తెలిపింది. మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లోని హై ఆల్టిట్యూడ్ టెస్ట్ ఫెసిలిటీలో నిర్వహించిన వాక్యూమ్ ఇగ్నిషన్ పరీక్షల శ్రేణిలో ఇది ఏడోది. ఇదిలా ఉండగా.. 2024 గగన్‌యాన్‌కు సన్నాహక సంవత్సరమని ఇస్రో ఛైర్మన్ సోమ్‌నాథ్ ఈ ఏడాది ప్రారంభంలో పేర్కొన్నారు. గగన్‌యాన్ మిషన్ కోసం హెలీకాప్టర్ నుంచి డ్రాప్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో ప్యారాచూట్ సిస్టమ్‌ను టెస్ట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. దాంతో పాటు పలు డ్రాప్ టెస్టులు నిర్వహించన్నుట్లు పేర్కొన్నారు. వీటితో పాటు పలు వాల్యుయేషన్ పరీక్షలు సైతం జరుగుతాయన్నారు. గగన్‌యాన్ మిషన్‌లో ఇస్రో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపనున్నది. ముగ్గురు వ్యోమగాములను దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తయిన కక్ష్యలోకి చేర్చి.. తిరిగి వారిని భూమిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ప్రయోగం మూడు రోజులపాటు జరగనున్నది. వ్యోమగాములు తిరుగు ప్రయాణంలో సముద్రంపై సురక్షితంగా దిగాల్సి ఉంటుంది. ఈ మిషన్‌ను 2025లో చేపట్టాలని భావిస్తున్నది. వాస్తవానికి 2022లోనే ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. కరోనా కారణంగా వాయితా పడుతూ వచ్చింది. ఇస్రో చేపట్టిన మిషన్ విజయవంతమైతే అమెరికా, చైనా, సోవియట్ యూనియన్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించనున్నది.

# కొడంగల్‌కు రూ.4,369 కోట్లు

మొదటి పేజీ తరువాయి...

చేశారు. రూ.20 కోట్లతో మద్దూర్ మండల కేంద్రంలో బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కాలేజినని నిర్మించనున్నారు. రూ.25 కోట్లతో కొడంగల్ మండల కేంద్రంలో బాలుర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కాలేజి, రూ.224.50 కోట్లతో మెడికల్ కాలేజీ,నర్సింగ్ కాలేజి, ఫిజియోథెరపీ కాలేజి,220 పడకల హాస్పిటల్ , రూ.213.2070 కోట్లతో కొడంగల్ నియోజకవర్గంలో హెచ్ఎల్బిఎస్ మరియు అప్రోచ్ రోడ్ పనులు, రూ.3.99 కోట్లతో దుద్యాల్ మండలంలోనీ హస్నాబాద్ గ్రామ నూతన 33/11 కెవి సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు. ఈ పనులన్నీ శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని రేవంత్ రెడ్డి ఆదేశించారు. రేవంత్ పర్యటనకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. -

# పుణేలో మెఫెడ్రిన్ పట్టివేత..

## మార్కెట్ విలువ రూ.2,200 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం): మహారాష్ట్ర, దిల్లీలో భారీ ఎత్తున మ్యావ్ మ్యావ్ (మెఫెడ్రిన్) అనే మాదక ద్రవ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. పుణె నగరం నుంచి 75 కిలోమీటర్ల దూరంలోని షోలాపుర్ వద్ద కుర్‌కుంభ సమీపంలోని ఓ ఫార్మాస్యూటికల్ ప్లాంట్‌లో 700 కేజీల డ్రగ్‌ను సీజ్ చేశారు. మరో వైపు దిల్లీలోని హౌజా ఖాస్ ఏరియాలో దాడులు నిర్వహించి 400 కేజీలను పట్టుకొన్నారు. వీటి మొత్తం మార్కెట్ విలువ ఏకంగా రూ.2,200 కోట్లుగా అంచనా వేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ ఘటనపై అదనపు పోలీస్ కమిషనర్ శైలేష్ బాల్కవాడే మాట్లాడుతూ "మేము ఆ ఫార్మా ప్లాంట్ ఓనర్‌ను అరెస్టు చేశాం. భీంజీ అలియాస్ అనిల్ పరశురాం, కెమికల్ ఇంజినీర్ యువరాజ్ బబన్ భుజ్‌భాయ్‌కు దీంతో సంబంధం ఉంది" అని పేర్కొన్నారు. తమ బృందం దిల్లీ వెళ్లి స్థానిక పోలీసుల సాయంతో అక్కడ దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ రాకెట్‌లో కొందరు విదేశీయులు, విదేశాల్లోని భారతీయుల హస్తం కూడా ఉన్నట్లు తాము గుర్తించామని పోలీస్ కమిషనర్ చెప్పారు. డగ్స్‌ను ప్యాక్ చేయడానికి నిందితులు ఉప్పు గోదాములను వినియోగించినట్లు పేర్కొన్నారు. ఫార్మా కంపెనీ యజమాని, ఈ డ్రగ్ మాఫియా మాస్టర్‌మైండ్ మధ్య సంబంధాలు ఎలా మొదలయ్యాయో గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మెఫెడ్రిన్ తయారీ, విక్రయంపై పూర్తిస్థాయిలో నిషేధం ఉంది. దీనిని ఉల్లంఘిస్తే ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేయవచ్చు. ప్రస్తుతం స్వాధీనం చేసుకొన్న మాదక ద్రవ్యాన్ని కుర్‌కుంభ నుంచి దిల్లీలోని స్టోరేజీ పాయింట్లకు తరలించి భద్రపరుస్తున్నారు. తాజా దాడుల్లో వీటి సరఫరా దారులను కూడా అరెస్టు చేశారు. వీరి వద్ద రూ.3.58 కోట్లు విలువైన మెఫెడ్రిన్‌ను ఉన్నట్లు గుర్తించారు. గతేడాది ముంబయిలో ఒక కర్మాగారంపై దాడి చేసి రూ. 1,400 కోట్లు విలువైన మాదక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు.



# మేడారం జాతరకు పోటెత్తిన భక్తజనం

మొదటి పేజీ తరువాయి...

సమర్పిస్తున్నారు. శివసత్తులు, ఓడిబియ్యం, చీరే సారెలతో తల్లుల ముందు ప్రణమిల్లుతున్నారు. ఇక వరాల తల్లి సమ్మక గురువారం మేడారం గద్దెలపైకి రానున్నది. ఇద్దరు వన దేవతలు గద్దెలపై ఉండే శు క్రవారం మేడారం మొత్తం భక్తులతో కిటకిటలాడుతుంది. శనివారం వన దేవతలు గద్దెలపై నుంచి వనంలోకి వెళ్లడంతో జాతర ముగుస్తుంది. మేడారం జాతర నేపథ్యంలో ములుగు జిల్లాలో ఉన్నటువంటి స్కూల్స్, కాలేజీలకు సెలవులు ప్రకటించారు. నాలుగు రోజులపాటు సెలవులు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. సండే కూడా సెలవు కావడంతో వరుసగా 5 రోజులు సెలవులు వచ్చాయి. మేడారం జాతర కోసం దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నారు. భక్తులకు పార్కింగ్ తదితర చిన్న, చిన్న సమస్యలు ఎదురైనప్పటికీ, తాగునీరు, వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు జాతరకు వచ్చేందుకు ప్రత్యేక బస్సులతో పాటు పర్యాటక శాఖ హెలికాప్టర్ల సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఇక మేడారం జాతర నిర్వహణకు కేంద్రం 3.14 కోట్ల నిధుల కేటాయించింది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి రూ.2.30 కోట్లు, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ నుంచి రూ. 0.84 కోట్ల నిధులు విడుదల చేసింది. మేడారం మహాజాతరకు ముందే లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. దూరప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలు లెక్కచేయక తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ నాలుగు రోజుల్లో కోటిపైన భక్తులు దర్శించు కోనున్నారు. అమ్మల రాక చీకటిని చీల్చుకుంటూ వెలుగులు విరజిమ్ముతుంది. రెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ జాతరలో ప్రతి ఘట్టం.. గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతుంది.

# ఆటోను ఢీ కొట్టిన లారీ

మొదటి పేజీ తరువాయి...

ప్రయాణికుల తో వెళుతున్న ఆటోరిక్షాను ను ఓ లారీ రాంగ్ సైడ్ లో దూసుకు వచ్చి ఢీకొట్టింది. దీంతో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఐదుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందగానే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత చికిత్స పొందుతున్న టెంపో డ్రైవర్ మృతి చెందడంతో.. చనిపోయిన వారి సంఖ్య 9కి చేరుకుంది. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు. ఘటన తర్వాత లారీ డ్రైవర్ సంఘటన స్థలం నుంచి పారిపోయాడు. దీంతో అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రమాదంలో బాధితులంతా టెంపోలోని వారే%ౌా% వారందరూ సికంద్రాలో క్యాటరింగ్ పని ముగించుకుని ఇంటికి వెళ్లడానికి లఖిసరాయ్ రైల్వే స్టేషన్ కు వెళుతున్నారు.



కలెక్టర్ సంతోష్ కు పూల మొక్కను అందజేస్తున్న అదనపు కలెక్టర్

# జిల్లా అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) మూసిని వెంకటేశ్వర్లు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం) జోగుళాంబ గద్వాల జిల్లా నూతన అదనపు కలెక్టర్ గా(రెవెన్యూ) మూసిని వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలో భాగంగా అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు బదిలీ పై జిల్లా అదనపు కలెక్టర్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు.

# భారీ ఉద్యమానికి బీఆర్ఎస్ సన్నాహాలు

## నీటి పోరు పేరుతో త్వరలో ప్రజల్లోకి..!

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం): పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ యాక్టివ్ అవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో నీళ్లనే ప్రచారాస్త్రంగా మలుచుకునేందుకు వ్యూహం రచిస్తోంది. ఈ క్రమంలోనే రాజకీయంగా కొత్త పంచాయితీ ముందుకేసుకుంది. నీళ్లతో నిప్పులు రాజేయడానికి మళ్లీ పోరు బాట పట్టనుంది గులాబీ పార్టీ. త్వరలో నీటి పోరు యాత్ర చేసేందుకు రెడీ అయింది. దక్షిణ తెలంగాణలోని నాగార్జున సాగర్, ఉత్తర తెలంగాణలోని కాళేశ్వరం నుంచి నీటి పోరు యాత్ర ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. యాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీఆర్ఎస్ పెద్దలు ప్లాన్ చేశారు. ఇటీవలే కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించడంపై నల్గొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభ సక్సెస్‌తో జోష్‌లో ఉన్న బీఆర్ఎస్ ఇదే ఊపులో నీటి పోరు యాత్ర చేసి తమ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కారు పార్టీ డిసైడైనట్లు కనిపిస్తోంది. తెలంగాణ కోసం కొట్లాడేది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఎన్నికల వేళ మరోసారి ప్రజలకు గుర్తుచేసేందుకే ఈ యాత్ర అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలావుంటే, స్వతంత్ర్య భారతవనీలో కనువినీ ఎరుగని జలదోపిడి. నీటి పేరుతో నోట్ల కట్టలను వెనకేసుకున్నారంటూ ఇటీవల శాసనసభ సాక్షిగా ప్రస్తుత ప్రభుత్వం. గత ప్రభుత్వంపై విరుచుకుపడింది. అసలే మేడిగడ్డ పేకమైదైందని.. సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లు కూడా డేంజర్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. మరి తాతలనాటి ప్రాజెక్టులు తాపీగా నిలబడ్డా.. ఇప్పటి ప్రాజెక్టులెందుకు కుంగిపోతున్నాయి. ఈ కుంగుబాటుకు కారణం మీరంటే మీరంటూ అసెంబ్లీలో అధికార విపక్షాల మధ్యవాదోపవాదాలు తారాస్థాయిలో జరిగాయి. ఇంతకూ ప్రాజెక్టుల పంచాయితీలో ఎవరి వాదనలో వాస్తవముంది..? నీటి వాటాలపై ఏపీ, తెలంగాణ మధ్య యుద్ధం ఎప్పటి నుంచో జరుగుతున్న ముచ్చట. లేటెస్ట్‌గా తెలంగాణలోనే అధికార, విపక్షాల మధ్య వార్ మొదలైంది. తప్పు నీదంటే నీదంటే ఇరు వర్గాలు వాదించుకుంటున్నాయి. అదే సమయంలో తమపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతోంది ఏపీ. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల విషయంలో అన్యాయం జరిగింది. ఆ అన్యాయానికి




బీఆర్ఎస్సే కారణం అని కాంగ్రెస్ అరోపిస్తోంది. అయితే కాంగ్రెస్ వల్లే రాష్ట్రానికి నష్టం జరుగుతోందని ఆరోపిస్తోంది గులాబీ పార్టీ. ఇదే అంశంపై అటు అసెంబ్లీలో.. ఇటు మేడిగడ్డ గట్టు మీద నుంచి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది అధికార పార్టీ. ఇక నల్గొండ వేదికగా కాంగ్రెస్ పార్టీపై గర్జించారు మాజీ సీఎం కేసీఆర్.

# అధికారులకు సన్మానం

బుద్వేల్, ఫిబ్రవరి21(ప్రభాత ఉదయం) : పార్లమెంటు ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరగడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని రాజేంద్రనగర్ ఆర్డీవో కె.వెంకట్ రెడ్డి కోరారు. రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి బుధవారం రాజకీయ పార్టీల నాయకుల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతనంగా వచ్చిన రాజేంద్రనగర్ ఆర్డీవో కె వెంకటరెడ్డి , రాజేంద్రనగర్ తహసీల్దార్ బి. రాములు పాల్గొని రాబోయే ఎన్నికల్లో ఎవరి డిపార్ట్మెంట్ పని వారు నిర్వహిస్తారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఏ విధంగా అయితే ప్రశాంతంగా జరిగిందో అదే విధంగా ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు పూర్తి అయ్యే వరకు అన్ని పార్టీలు సహకరించాలని సూచనలు చేశారు. ఎద్దైన ఉంటే సమాచారం ఇవ్వగలరు అని తెలిపారు . ఈ సమావేశంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ , కాంగ్రెస్ నాయకులు కోరని బాల్ రాజ్ , ఎన్. ధనంజయ, మహమ్మద్ ఖాలెద్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా వచ్చిన ఆర్డీవో, తహసీల్దార్ లను శాలువాతో సన్మానించారు.


రాజేంద్రనగర్ ఆర్డీవో కె. వెంకట్ రెడ్డి, తహసీల్దార్ బి రాములు లను సన్మానిస్తున్న నాయకులు



## మహబూబ్ నగర్ ఎంపీ స్థానాన్ని బిజెపి భారీ మెజార్టీతో గెలిపించాలి

### విజయ సంకల్ప యాత్ర లో కిషన్ రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానాన్ని బిజెపి భారీ మెజార్టీతో కైవసం చేసుకునే విధంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండల కేంద్రంలో జరిగిన విజయసంకల్ప బస్సు యాత్రలో కేంద్ర మంత్రి, తెలంగాణ బిజెపి అధ్యక్షులు కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా యాత్ర లో పాల్గొన్నారు. దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో జై శ్రీరాం,, ఔర్ ఏక్ బార్ మోడి సర్కార్ నినాదాలతో యాత్ర కొనసాగింది.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... దేశ ప్రజలు మరోసారి నరేంద్ర మోడి ఉండాలని కోరుకుంటున్నారు మా ఓటు ఈ సారి మోడీకే అని ప్రజలు జేజేలు పలుకుతున్నారు. కరోనా పరిస్థితుల్లో భారత దేశ ప్రజలను కాపాడిన నాయకుడు ప్రధాని మోడిపేదల కష్టాలు తెలిసిన వ్యక్తి కాబట్టే.. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధాని మోడి కృషి చేస్తున్నారు.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్ నగర్ అభ్యర్థి గెలుపులో దేవరకద్ర నుంచి భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ , మహబూబ్ నగర్ పార్లమెంటు మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి , సీనియర్ నాయకులు శాంతి కుమార్ , బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రోహిత్ - ఐశ్వర్య లను ఆశీర్వదిస్తున్న బంధువులు, స్నేహితులు


వధూవరులను కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రైనీ స్కాలర్స్ హై స్కూల్ టీచర్లు

## దుర్గా కన్వెన్షన్‌లో ఘనంగా రోహిత్- ఐశ్వర్యల రిసిప్షన్ వేడుక

బుద్వేల్, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం): బుధవారం సాయంత్రం రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి, దుర్గా కన్వెన్షన్ లో రోహిత్ - ఐశ్వర్య ల రిసిప్షన్ ఘనంగా జరిగింది. రాజేంద్రనగర్ హైదర్ గూడ వాస్తవ్యులు కొక్కు నాగ సీత - కొక్కు శ్రీనివాసరావు ల పెద్ద కుమారుడు రోహిత్, కీర్తిశేషులు మూడికే రామ్మోహన్, మాధవి మోహన్ ల ప్రథమ పుత్రిక ఐశ్వర్య తో ఈ నెల 18న వివాహం జరిగింది. బుధవారం జరిగిన విందు (రిసిప్షన్) ఎంతో చక్కగా జరిగింది. చల్లటి సాయంత్రం వేళలో దుర్గా కన్వెన్షన్ లో రిసిప్షన్ వేడుక జరుగగా బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు నూతన వధూవరులను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్కెస్ట్రా పాటలు, డీజే సౌండ్ లతో రిసిప్షన్ వేడుకకు వచ్చిన బంధు మిత్రులను మంత్ర ముగ్దులను చేసింది. కన్వెన్షన్ పచ్చిక బయళ్లలో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. రిసిప్షన్ వేడుకలో ఇరు కుటుంబాలకు చెందిన వందలాది మంది బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా: కార్పొరేటర్ సంగీత

బిటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సంగీత

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం) అత్తాపూర్ డివిజన్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని డివిజన్ కార్పొరేటర్ ఎం సంగీత గౌరీ శంకర్ అన్నారు. బుధవారం అత్తాపూర్ డివిజన్ లో బీటీ రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం సంగీత గౌరీ శంకర్ 176 పిల్లర్ సమీపంలో గల చింతల్ మెట్ వెళ్లే ప్రధాన రహదారి 14 లక్షల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు అభివృద్ధి పనులకు జిహెచ్ఎంసి అధికారులు, బస్తీ ప్రజలతో కలిసి పనులను కార్పొరేటర్ సంగీత ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంగీత మాట్లాడుతూ... ఎన్నో ఏండ్ల తరబడి నోచుకోని రోడ్డు నిర్మాణం అభివృద్ధి పనులు తమరి అయామ్ లో బీటీ రోడ్డు వేయడం చాలా సంతోషంగా ఉందని బస్తి ప్రజలు సంతోషం వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు ఆయా బస్తీలలో ఇంకేమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే జిహెచ్ఎంసి అధికారులతో చర్చించి దశలవారీగా పరిష్కరిస్తామని బస్తీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ ఇంజనీర్ మధుసూదన్ రావు, బిజెపి నాయకులు బీటుకూరి సిద్దేశ్వర్ ,వర్క్ ఇన్ స్పెక్టర్ రాజు ,బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

# చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజార్టీతో కైవసం చేసుకుంటాం: మురళీధర్ రావు






## చేవెళ్లలో కాంగ్రెస్‌కు అభ్యర్థి లేరు

చేవెళ్ల, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం) చేవెళ్లలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దొరకడం లేదని బీజేపీ నేతలు ఎద్దేవా చేశారు. చేవెళ్లలో కాంగ్రెస్ కు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. మోడీ మూడోసారి ప్రధాని కావడమే లక్ష్యంగా బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర బుధవారం రాత్రి చేవెళ్లకు చేరుకుంది. చేవెళ్ల మండల కేంద్రంలోని శంకర్ పల్లి చౌరస్తాలో విజయ సంకల్ప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, మధ్యప్రదేశ్ ఇంచార్జి మురళీధర్ రావు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి, రాణి రుద్రమదేవిలు హాజరయ్యారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ.. మూడోసారి మోడిని ప్రధాని చేస్తే భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంటుందన్నారు కాంగ్రెస్ పార్టీ దేశాన్ని దోపిడీ చేసిందని.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ పాలన కొనసాగించిందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ గల్లంతు అవుతోందన్నారు. హిందువుల చిరకాల కోరిక అయోధ్యలో రామ మందిరం నిర్మాణం చేసిన ఘనత మోడీదన్నారు. తెలంగాణ నుండి నలుగురు ఎంపీలు ఉంటేనే రూ.10లక్షలు కోట్ల నిధులు తెచ్చుకున్నామని.. అదే బీజేపీకి 17 ఎంపీలు ఉంటే ఎన్ని నిధులు వస్తాయో ఆలోచించాలని అన్నారు. ఈ సారి బీజేపీ 17 స్థానాలు గెలుపొందితే తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు మారిపోతుందన్నారు. ఇప్పుడు ఉన్న ఎంపీ భూములు కొన్నాడు తప్ప చేసింది ఏమిలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ సొమ్మును దోచుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ఈ ఎలాంటి పొత్తు లేదని బీజేపీ నేతలు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ బిజెపి ఇంచార్జ్ మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, మల్గారి రమణారెడ్డి, వైభవ్, మండల ఉపాధ్యక్షుడు కేశపల్లి వెంకట్రాంరెడ్డి, కృష్ణ గౌడ్, బండారు శేఖర్ రెడ్డి, పత్తి సత్యనారాయణ, కృష్ణమోహన్, వివిధ మండలాల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.విజయ సంకల్ప బస్ యాత్ర చేవెళ్ల పార్ల మెంట్ పరిధిలో ని తాండూర్, వికారాబాద్ ర్యాలీ నిర్వహించారు






## గద్వాల జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో నిరుపయోగంగా 2డి ఎకో పరికరం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ అసుపత్రులలో అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేసింది. వైద్యానికి ఆసరాగా ఉండాల్సిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నా పూర్తి స్థాయిలో వినియోగించడంలేదు. రూ.లక్షలు వ్యయం చేసి కొనుగోలు చేసిన పరికరాలను ఉపయోగించే నిపుణులు లేక నిరుపయోగంగా మారుతున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రేడియాలజి హబ్ లో గుండె పరీక్షలకు ఉపయోగించే 2డి ఎకో యంత్రం నిరుపయోగంగా ఉంది. 2డి ఎకో యంత్రం ఉన్నా కార్డియాలజిస్ట్ లేకపోవడంతో నిరుపయోగంలో ఉందని, ఫలితంగా మెరుగైన వైద్యం కోసం కర్నూల్, హైదరాబాద్‌కు తరలాల్సి వస్తోందని రోగులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. లక్షలు వెచ్చించి 2డి ఎకో పరికరాన్ని జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తే... వైద్య నిపుణులు లేక ప్రైవేటుకు రెఫర్ చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. నిత్యం వందలాది ప్రజలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుండగా ఉచిత వైద్యం అరకొరగానే అందుతోందని, ఉచిత వైద్యం లక్ష్యం నెరవేరడంలేదని రోగులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఎంఆర్ఐ, సి.టి. స్కాన్ లేకపోవడంతో వాటికోసం బయట రూ.వేలు వెచ్చించాల్సి వస్తోంది. పరీక్షలకు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి రావడం వ్యయంతో కూడుకున్నదే కాకుండా వైద్యంలో జాప్యానికి కారణమవుతోంది. అత్యాధునిక వైద్య పరికరాల వినియోగం కోసం టెక్నీషియన్లు, స్పెషలిస్ట్‌లను నియమించడం వంటి చర్యలతోనే రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో ఉచిత వైద్యసేవలు అందుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


బాధితులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి 50 వేల ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం) దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రం 5 వార్డ్ లో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన గట్టు యాదవ్ కు ఎమ్మెల్యే జిఎంఆర్ 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం బాధ్యత నివాసంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి, వారి నివాసం మొత్తం అగ్గికి ఆహుతై పూర్తిగా నిరాశ్రయులయ్యారు, సంఘటన స్థలానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి , అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలసి సందర్శించి గట్టు యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రభుత్వం నుండి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే జియంఆర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నూతన వధువు వరులను ఆశీర్వదిస్తున్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు భీమ్ రెడ్డి

## ఘనంగా హైకోర్టు న్యాయవాది దామోదర్ రెడ్డి కుమారుడు సాయి చంద్రారెడ్డి,అపర్ణ రెడ్డిల వివాహ వేడకలు

కొత్తకోట, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం) హైకోర్టు న్యాయవాది మూలమల్ల దామోదర్ రెడ్డి కుమారుడు సాయి చంద్రారెడ్డి, అపర్ణ రెడ్డి ల వివాహ వేడుకలు కొత్తకోట పట్టణ కేంద్రంలో శివ గార్డెన్ లో ఘనంగా జరిగాయి. నూతన వధూవరులు సాయి చంద్రారెడ్డి, అపర్ణ రెడ్డి ల వివాహ వేడుకల్లో గోపాల్ పేట జెడ్ పి టి సి సభ్యులు కోటేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి , రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ జి శేషి రెడ్డి, రిటైర్డ్ ఎపిజివిబి మేనేజర్ జగన్నాథం గౌడ్ తదితరులు పాల్గొని ఆశీర్వదించారు.

## విద్యుత్ సమస్య ఉంటే ఫోన్‌చేయండి

### అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్



గండిపేట, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం) ఇబ్రహీం బాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వినియోగదారులు తమ ప్రాంతాలలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ జ్ఞానేశ్వర్ తెలిపారు. మణికొండ, మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాలలో గల కాలనీలు బస్తీలలో వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమ ప్రాంతాలలో ఉన్న సమస్యలను ఈ ఫోన్ నెంబర్లు 9440813046, 7901093677,9440813060,9440813097, ఎఫ్ ఓ సి నంబర్ 94931 93119 కు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చు అన్నారు.

# జీవిత లక్ష్యాలను చేరడానికి అపజయాలనే మెట్లుగా మలచుకోవాలి


ఎస్పి రితిరాజ్ ను సన్మానిస్తున్న మహిళ అధ్యాపకులు


పాల్గొన్న విద్యార్థులు

## చిన్న చిన్న సమస్యలకు భయపడవద్దు

### విద్యార్థులు తమ గోల్స్ ను రోజు గుర్తు చేసుకుంటు కష్టపడితేనే చేరుకోగలరు

### ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలోజిల్లా ఎస్పీ రితిరాజ్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం) విద్యార్థులు తమ లక్ష్య సాధనలో ఎదురయ్యే అపజయాలను స్పిరిట్ గా తీసుకుంటూ ముందుకు వెళితేనే తమ లక్ష్యాలను చేరుకుంటారని జిల్లా ఎస్పీ శ్రీమతి రితిరాజ్ తెలిపారు. బుధవారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడుకోలు సమావేశ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ జీవిత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ఆ లక్ష్యాన్ని చేరే క్రమం లో వచ్చే అడ్డంకులను, అపజయాలను మెట్లుగా మార్చుకొని అధిగమిస్తేనే తమ లక్ష్యాన్ని చేరుకుంటారని ఆ దిశగా విద్యార్థులుఅడుగులు వేయాలని అన్నారు. తమకు వచ్చే ప్రతి అడ్డంకిని తమకు అనుకూలంగా మల్చుకోవాలని, అపజయాలను స్పిరిట్ గా తీసుకోవటం అలవర్చుకోవాలని అప్పుడే తమ డ్రీమ్స్ ను చేరుకుంటారని అన్నారు. విద్యార్థులు ప్రతి రోజు తమ లక్ష్యాన్ని గుర్తు చేసుకోవాలని, అలాగే ప్రతి రోజు తమ అలవాట్లను గుర్తు చేసుకొని వాటిలో తమ లక్ష్యాన్ని చేరేందుకు అడ్డంకిగా ఉన్నా అలవాట్లను వదులుకోవాలని , ఉపయోగపడే అలవాట్లను మెరుగుపరుచుకోవాలని అన్నారు. అందులో భాగంగా సోషల్ మీడియా కు కొంత సమయం ఇవ్వాలి కానీ రోజు మొత్తం దానిలోనే ఉంటూ సమయాన్ని వృధా చేసుకోవద్దని అన్నారు. కష్టపడకుండా గోల్స్ ను ఆశించవద్దు అనీ, ఎక్కువ సమయం మంచి బుక్స్ ను చదివేందుకు ఉపయోగించాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ గోల్ కు, తమ తల్లిదండ్రులకు, తనకు ప్రియరిటిని ఇచుకున్నాకే స్నేహితులకు ఇవ్వాలని సూచించారు. మహిళ విద్యార్థులు తమ లక్ష్యాలను తల్లిదండ్రుల ముందు ఉంచాలని, ఇతరుల పై ఆధారపడకుండా ఆర్థికంగా స్వతంత్రంగా ఎదిగేందుకు విద్య ఒక్కటే మార్గం అని, చిన్న చిన్న సమస్యలకు బయపదొద్దని అన్నారు. జీవితంలో స్థిరపడినాకే వివాహాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి హృదయ రాజు, ప్రిన్సిపాల్ వీరన్న , అధ్యాపకులు బాలకృష్ణ, శిరీష బోరవెల్లి పవన్ కుమార్, శేఖర్, కలీముల్లా,గీతా, అనూష సుతారి గోపి, ఎస్.నరసింహులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


కళాశాల లో జరిగిన విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎస్పి రితిరాజ్

# నడిగడ్డ ఇష్టదైవం జములమ్మ పుట్టింటి నుంచి మెట్టినింటికి


అమ్మవారిని తీసుకు వస్తున్న పూజారులు


జమ్ములమ్మ అమ్మవారిని ఎడ్ల బండి పై తీసుకొస్తున్న గ్రామస్తులు


అమ్మవారిని దర్శించుకున్న జడ్పీ చైర్మన్ సరిత

## జనసంద్రంగా ఆలయం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)నడిగడ్డ ఇలవేల్పు శ్రీజమ్ములమ్మ అమ్మవారు బుధవారం పుట్టినింటి నుంచి మెట్టి నింటికి చేరుకుంది. తన తల్లి గ్రామమైన గుర్రంగడ్డ నుంచి బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా జమ్మిచేడులోని మెట్టినింటికి వచ్చింది. అమ్మవారిని తీసుకురా వడానికి మంగళవారం సారెతో ఎద్దుల బండి వెళ్లగా, సా యంత్రానికి గుర్రంగడ్డకు చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజ లు నిర్వహించిన అనంతరం, రాత్రి జములమ్మను కృష్ణాన దిలో బోటు ద్వారా ఒడ్డుకు తీసుకొచ్చారు. అక్కడ ఎద్దుల బండిపైన అమ్మవారిని కూర్చోబెట్టి బీరోలు, లత్తీపురం, వెం కటోనిపల్లి మీదుగా జమ్మిచేడుకు చేర్చారు. అమ్మవారు ఆలయానికి చేరిన తర్వాత జెడ్పీ చైర్ పర్సన్ సరిత, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి ఎద్దుల బండికి ఆహ్వానం పలికి, జములమ్మను ఆలయంలోకి చేర్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ చైర్మన్ గాయిత్రీ సతీష్‌కుమార్, ఈవో పురేందర్ శాలువాలతో స త్కరించి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. మాఘ శుద్ధ పౌర్ణమి నాడు జమ్ములమ్మ జాతర జరుగును. ప్రతి మంగళవారం, శుక్రవారం తెలంగాణ,రాయలసీమ, కర్ణాటక, పూణే తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఆరునెలల పాటు ప్రతి మంగళ, శుక్రవారాలలో జమ్ములమ్మ ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోతుంది. ఇప్పటికే బ్రహ్మోత్సవాల ఏర్పాటుకు ఆలయ నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

# షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

## సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ వస్త్ర దుకాణంలో మంటలు చెలరేగడంతో దుస్తులు, సామాగ్రి కాలిబూడిదైంది. దాదాపు రూ.30 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ఈ సంఘటన గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణం చిన్న అగ్రహారానికి చెందిన చంద్రబాబు గత కొంతకాలంగా తన ఇంట్లోనే వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున దుకాణంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి చుట్టుపక్కల దట్టమైన పొగలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకుని దుకాణంలో చెలరేగుతున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దాదాపు రూ.30 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు పోలీసులు అంచనా వేశారు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని షాట్ సర్క్యూట్ గురైన షాపును పరిశీలించారు. బట్టల షాప్ యజమాని చంద్రబాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంటా కౌన్సిలర్లు శ్రీను, బండలపాండు, ఎంపీపీ విజయ్, తదితరులు, ఉన్నారు.






### ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం: జడ్పీ చైర్ పర్సన్ సరిత

షార్ట్ సర్క్యూట్ కారణంగా వస్త్ర దుకాణం దగ్ధం కావడంతో జడ్పీ చైర్ పర్సన్ సరిత సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై యాజమాని చంద్రబాబును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని విద్యుత్ అధికారులను కోరారు. ఆమె వెంటా కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ యాదవ్, పులిపాటి వెంకటేష్, తిరుమలలేష్ జమిచెడ్ ఆనంద్, డీటీడీసీ నర్సింహా, తదితరులు ఉన్నారు.

## కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్

కూకట్‌పల్లి,ఫిబ్రవరి21 (నమస్తే ఉదయం) మూసాపేట్ సర్కిల్, ఫతేనగర్ డివిజన్ పరిధిలో ప్రజలకు మౌళిక వసతుల కల్పనకు ప్రణాళి కాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నట్లు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తెలిపారు. బుధవారం రూ. 20 లక్షలతో సమతానగర్ లో కమ్యూనిటీ హాల్ రెండవ అంతస్తు స్లాబ్ పనులను ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేకమైన దృష్టితో ఫతేనగర్ డివిజన్ కు అధిక నిధులు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న ఫతేనగర్ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్యం వంటి పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలలో బస్తీ నాయకులు, అసోసియేషన్ సభ్యులు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజేందర్, జనరల్ ప్రధాన కార్యదర్శి నరసింహా, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఉప సర్పంచ్ తమ్ముడిని పరామర్శించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి


గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం) గద్వాల జిల్లా ధరూర్ మండలం రేవులపల్లి గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ తెలుగు చిన్నరాముడు ను ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి పరామర్శించారు. మాజీ ఉపసర్పంచ్ చిన్న రాముడు తమ్ముడు తెలుగు చిరంజీవి కి ప్రమాదం జరగటంతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందాడు. చిన్న రాముడు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ శివారెడ్డి, బీమయ్య, కురుమన్న, సీసల పాషా, కృష్ణయ్య, రెహమాన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికకై రవీందర్ రెడ్డి దాఖలు

### ప్రతిపాదించిన ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్ గౌడ్

కూకట్‌పల్లి,ఫిబ్రవరి21 (ప్రభాత ఉదయం) రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత మొట్టమొదటిసారిగా జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం బుదవారం వాడి వేడిగా జరిగింది. ఎట్టకేలకు జీహెచ్ఎంసీ కొత్త కౌన్సిల్ తో పాలకమండలిని త్వరలో కొలువుతీరానుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా బీఆర్ఎస్ పార్టీ బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి జీహెచ్ఎంసీ రిటర్నింగ్ అధికారికి నియామక పత్రాలను దాఖలు చేశారు. ఈ విషయాన్ని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రతిపాదించి బలపరిచారు.




## ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి ప్రమాదాలను నివారించాలి

### సీపీఎం పార్టీ డిమాండ్

### డిప్యూటీ కమీషనర్ సి.హెచ్. కృష్ణయ్య కు కార్యదర్శి ఐలాపురం వినతి

కూకట్‌పల్లి,ఫిబ్రవరి21 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ శోభన బస్ స్టాప్ లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ కూకట్ పల్లి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సి. హెచ్. కృష్ణయ్య కు సీపీఎం పార్టీ బాలానగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుదవారం కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐలాపురం మాట్లాడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగ పరిచి బాలానగర్ శోభన సెంటర్లో నిర్మించాల్సిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఫిరోజ్ గూడ లో ఏర్పాటు చేశారని, ప్రస్తుతం ఫిరోజ్ గూడ లో ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిరూపయోగకారంగా ఉందన్నారు. శోభన బస్ స్టాప్ లో రోజుకు ఒక్కరు రోడ్డు క్రాస్ చేసే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటి వరకు అధికారికంగా 6 మంది చనిపోయారని, అనేక మంది రోడ్లు ప్రమాదాలబారిన పడుతున్నారని తెలిపారు. ఫతేనగర్, గౌతమ్ నగర్, శోభన కాలనీ నుండి రాజుకాలనీ ప్రభుత్వ హై స్కూల్ లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు రోడ్డు దాటే సమయంలో ప్రమాదం పొంచిఉందని, ఓ పక్కన రోడ్డు కు ఇరువైపులా వైపుల వైన్ షాపులు, కల్లు కాంపౌండ్ ఉంటడం తో ప్రమాదాలు మరీ ఎక్కువగా జరుగుతున్నాయని, ఈవిషయమై జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి ప్రజలకు, విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని వినతి పత్రంలో కోరారు. లేనిపక్షంలో జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయాన్ని, ప్రజా ప్రతినిధుల ఇండ్లను ముట్టడిస్తామని రాజశేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పి. శంకర్, తదితరులు పాల్గొన్నారు.




## మన తెలుగు అమెరికా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం

హైదరాబాద్ , ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం) నగరంలోని యూసఫ్ గూడ లో గల మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో మన తెలుగు అమెరికా అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి శుక్లాల(కేటరాక్ట్) సర్జరీ వైద్య శిబిరం కొనసాగుతోంది. తెలంగాణా మూవీ టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ నుండి 2వ రోజు సభ్యులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ... సేవ దృక్పథంతో ఏర్పాటు చేసిన ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు పేద ఆర్టిస్టులకు ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మా యూనియన్ సభ్యులకు స్పెషల్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో.. ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.పి.రెడ్డి, యూనియన్ ఈసీ మెంబర్లు కందుల శివ, సంజీవరావు, వాలి సత్యప్రకాష్ జూ"శోభన్ బాబు, వర్షిత, యూనియన్ సభ్యులు ఠాగూర్ సురేశ్,ధనలక్ష్మిరెడ్డి, ఓలేటి జయరామ్ అర్జునరావు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన రాజీవకనకాల, సుమ , శంకర్ నేత్రాలయం వారికి తెలంగాణ మూవీ టీవీ అండ్ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.